నమస్తే తెలంగాణ | DISTRICT SUPPLEMENT

# వికారాబాద్

మంగళవారం 17 అక్టోబర్ 2023
TUESDAY, OCTOBER 17, 2023 | VIKARABAD | పేజీలు PAGES : 12



ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అభ్యర్థులకు ప్రగతి భవన్‌లో బీఫారాలను అందజేసిన సీఎం కేసీఆర్

# విజేతలై తిరిగిరండి

**ఉమ్మడి జిల్లా అభ్యర్థులకు బీఫామ్‌లు అందజేసిన సీఎం కేసీఆర్**

- మ్యానిఫెస్టోను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- అభివృద్ధి, సంక్షేమాన్ని ఇంటింటికీ వివరించండి
- మంత్రి సబితారెడ్డి, ఇబ్రహీంపట్నం, చేవెళ్ల, పరిగి, వికారాబాద్ అభ్యర్థులకు బీఫామ్‌లు ఇచ్చి పలు సూచనలు సలహాలనిచ్చిన సీఎం కేసీఆర్
- మరింత హోరందుకోనున్న ప్రచారం

పరిగి/వికారాబాద్, అక్టోబర్ 16 : ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ అభ్యర్థులకు ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారం ప్రగతిభవన్‌లో బీఫామ్‌లు అందజేశారు. మంత్రి సబితాఇంద్రారెడ్డి, బీఆర్‌ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, పరిగి ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ బీఫామ్‌లు అందుకున్న వారిలో ఉన్నారు. ఆదివారం బీఫామ్‌లు అందుకోవాల్సి ఉన్నప్పటికీ కొన్ని సాంకేతిక కారణాల వల్ల వీరు సోమవారం తీసుకున్నారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ వారికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారని సమాచారం. కష్టపడి పని చేసి విజయంతో తిరిగి రావాలని ఆశీర్వదించినట్లు తెలిసింది. అలాగే, ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు బీఆర్‌ఎస్ ప్రకటించిన మ్యానిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నట్లు సమాచారం. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో అన్ని సీట్లను బీఆర్‌ఎస్ అభ్యర్థులు క్లీన్‌స్వీప్ చేయాలని వారికి చెప్పినట్లు తెలిసింది. బీఫామ్‌లు అందుకున్న వెంటనే అభ్యర్థులు వారివారి నియోజకవర్గాల్లో ప్రచారాన్ని ప్రారంభించారు.



బొంరాస్‌పేట మండలం మదన్‌పల్లిలో మాట్లాడుతున్న మంత్రి మహేందర్‌రెడ్డి

# పండుగలా ప్రచారం

- వికారాబాద్ జిల్లాలో ప్రచారాన్ని షురూ చేసిన గులాబీ దళం
- గడపగడపకూ వెళ్లి అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరణ
- మళ్లీ ఆశీర్వదిస్తే అండగా ఉంటామని ప్రజలకు భరోసానిచ్చిన ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, పట్నం నరేందర్‌రెడ్డి
- ఓ వైపు పార్టీ కార్యాలయాల ప్రారంభోత్సవాలు.. మరోవైపు విస్తృతస్థాయి సమావేశాలతో బిజీబిజీ
- ఊరూరా బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోపైనే జనం చర్చ
- బీఆర్‌ఎస్‌లోకి కొనసాగుతున్న వలసల పర్వం
- కాలనీల అసోసియేషన్లు, కుల సంఘాల నుంచి వెల్లువలా మద్దతు

లోపలి పేజీల్లో..

ఎన్నికల రణరంగంలో గులాబీ దళం దూసుకెళ్తున్నది. సోమవారం వికారాబాద్ జిల్లా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులు ప్రచార జోరును పెంచారు. బొంరాస్‌పేట మండలంలోని మదన్‌పల్లి గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఎన్నికల ప్రచార రథానికి ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డితో కలిసి రాష్ట్ర గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి పూజలు చేసి ప్రచారాన్ని షురూ చేశారు. వికారాబాద్ ఎమ్మెల్యే ఆనంద్ అనంతపద్మనాభస్వామిని దర్శించుకుని, ఆలంపల్లి దర్గాలో ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేసిన అనంతరం వికారాబాద్ మండలం పెండ్లి మడుగు గ్రామంలో ప్రచారాన్ని ప్రారంభించారు. పలు గ్రామాల్లో మహిళలు బోనాలతో స్వాగతం పలుకుతూ బ్రహ్మరథం పట్టగా, డప్పు కళాకారుల ప్రదర్శనలు.. ర్యాలీలతో ప్రచారం హోరెత్తింది. గడపగడపకూ వెళ్లి తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు కొత్త మ్యానిఫెస్టో అమలుతో కలిగే ప్రయోజనాలను తెలిపారు. మళ్లీ ఆశీర్వదిస్తే అండగా ఉంటామని భరోసానిచ్చారు. బీఆర్‌ఎస్‌కు హ్యాట్రిక్ విజయాన్ని కట్టబెట్టాలని ఓటర్లను అభ్యర్థించారు. ఓ వైపు పార్టీ కార్యాలయాల ప్రారంభోత్సవాలు.. మరోవైపు విస్తృతస్థాయి సమావేశాలతో అభ్యర్థులు రోజంతా బిజీబిజీగా గడిపారు. కాలనీల అసోసియేషన్లు, కుల సంఘాల నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభిస్తుండగా.. బీఆర్‌ఎస్‌లోకి వలసల పర్వం కొనసాగుతున్నది. మదన్‌పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు మంత్రి మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డిల సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వికారాబాద్ పట్టణం కొత్తగడి హనుమాన్ ఆలయంలో ఎమ్మెల్యే ఆనంద్ పూజలు చేసిన అనంతరం పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇతర పార్టీలకు చెందినవారు ఎమ్మెల్యే సమక్షంలో భారీ ఎత్తున బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఏ ఊరికెళ్లినా బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోపైనే జనం చర్చించుకుంటూ జేజేలు పలుకుతుండడం గమనార్హం.

– వికారాబాద్/బొంరాస్‌పేట, అక్టోబర్ 16



పెండ్లిమడుగు గ్రామంలో ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌కు హారతి ఇస్తున్న మహిళలు



ఎమ్మెల్యే ఆనంద్‌కు బోనాలతో స్వాగతం పలుకుతున్న మహిళలు

మన కోసం మ్యానిఫెస్టో

# ఆరోగ్యానికి.. అందలం

- మ్యానిఫెస్టోలో ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు ప్రకటనపై హర్షాతిరేకాలు
- రూ.15లక్షల వరకు పెంచుతామని సీఎం ప్రకటించడంతో ఉమ్మడి జిల్లాలో సంబురాలు
- తొమ్మిదేండ్లలో వైద్యరంగంలో అద్భుతాలు సృష్టించారని ప్రశంసలు
- మళ్లీ 'కేసీఆరే మా సీఎం'.. అని నినదిస్తున్న జనం

బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చినప్పుడు తొమ్మిదేండ్ల క్రితం ఆరోగ్యశ్రీ చికిత్స పరిమితి కేవలం రూ.2 లక్షలు మాత్రమే ఉన్న విషయం విదితమే. 2014లో బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ మొత్తాన్ని రూ.5 లక్షలకు పెంచారు. తరువాత రూ.10 లక్షలకు పెంచడం జరిగింది. తాజాగా మ్యానిఫెస్టోలో ఈ పరిధిని రూ.15 లక్షలకు పెంచుతామని సీఎం కేసీఆర్ ప్రకటించడంపై ఉమ్మడి జిల్లావ్యాప్తంగా హర్షాతిరేకాలు వెల్లువెత్తుతున్నాయి. ఒకపక్క ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయడం, హైదరాబాద్‌కు అన్ని వైపులా సూపర్ స్పెషాలిటీ దవాఖానలు అందుబాటులోకి రానుండడంతో వైద్యరంగంలో అనేక అద్భుతాలు చోటుచేసుకోబోతున్నాయని బీఆర్‌ఎస్ పనితీరును ప్రజలు ప్రశంసిస్తున్నారు. 'మళ్లీ బీఆర్‌ఎస్‌నే గెలిపిస్తామని.. కేసీఆరే మా సీఎం' అని జనం నినదిస్తున్నారు..



- న్యూస్ నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ